క్లుప్తంగా

బాలికలకు సమాన హక్కులు



మాట్లాడుతున్న సీడీపీఓ లలిత

మద్దికెర : బాలికలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయని వాటిని హరింపజేయాలని చూస్తే చట్టం కఠినంగా శిక్షిస్తుందని సీడీపీఓ లలిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ సైబర్‌నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. యుక్త వయస్సులో బాలికల్లో చోటు చేసుకునే శారీరక, మానసిక మార్పులకు అనుగుణంగా సానుకూల ప్రవర్తన కలిగి ఉండేలా సూచించాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. ప్రత్యేక అధికారి ఉమాదేవి, ఎంపీడీఓ కొండయ్య పాల్గొన్నారు.

పగిడిరాయిలో దేవరకు ఏర్పాట్లు



ఉత్సవాలకు ముస్తాబైన అంకాలమ్మ ఆలయం

తుగ్గలి : మండలంలోని పగిడిరాయి గ్రామంలో వెలసిన అంకాలమ్మ, గుండమయ్య, గుండమ్మ దేవరను ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్తులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. 21న గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, 22న బోనాలు సమర్పిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఇప్పటికే ఆలయాలకు రంగులు వేసి సిద్ధం చేశారు. ఆయా పార్టీల నాయకులు తమ అభిమాన నేతలను, కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పత్తికొండ(తుగ్గలి) : సీఎం సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నుంచి నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన ఏడుగురికి మంజూరైన రూ.3.80లక్షలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ తన కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. పట్టణానికి చెందిన పెద్ద లాలుకు రూ.1,11,900, అక్బర్‌బాషాకు రూ.37,700, కుర్వ పెద్ద రంగస్వామికి రూ.77,900, తుగ్గలి మండలం రాంపల్లి సుభాష్‌చంద్రబోస్‌కు రూ.32,200, జొన్నగిరి సంగాల ఆనందమ్మకు రూ.30,700, మద్దికెర మండలం పెరవలి వడ్డే సుశీలమ్మకు రూ.51వేలు, కృష్ణగిరి మండలం కంబాలపాడుకు చెందిన మాధవికి రూ.36,700 మంజూరయ్యాయి. చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు.

నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

పత్తికొండ(తుగ్గలి) : నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో క్రైం మీటింగ్ నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. నేరస్తులపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని సూచించారు. నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: ఫిబ్రవరి 6 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం నాయకులు రమేష్, లక్ష్మన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. శేఖర్, సుధాకర్, శ్రీను, విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మవ్వ కల్యాణోత్సవం



సమ్మతగేరి మారెమ్మ అవ్వ

హొళగుంద: మండలంలోని సమ్మతగేరి గ్రామంలో వెలసిన మారెమ్మ కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ఆలయం ముందు పెళ్లి పందిరి వేసి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అమ్మవారికి అభిముఖంగా దున్నపోతు దూడను ఉంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మాంగల్యధారణ గావించారు. భక్తులకు అన్నదానం చేశారు. చుట్టుపక్కల పల్లెలతో పాటు ఆంధ్ర – కర్ణాటకకు చెందిన భక్తులు హాజరై మారెమ్మను దర్శించుకున్నారు. మూడేళ్ల తరువాత నిర్వహించే దేవరకు ఈ కార్యక్రమం నాంది అని గ్రామస్తులు పేర్కొన్నారు.

కొత్త రోడ్డు వేస్తామన్నారే?

- చిద్రమైన హొళగుంద– ఆదోని రోడ్డు
- నరకప్రాయంగా ప్రయాణం
- ధణాపురం– హొళగుంద వరకు రూ.62.29 కోట్లు ఎన్‌డీబీ నిధులు మంజూరు
- అర్ధంతరంగా నిలిచిన పనులు
- అదిగో ఇదిగో అంటున్న అధికారులు



మారెమ్మ వంక వద్ద దారుణంగా మారిన ఆదోని రోడ్డు

హొళగుంద: కొత్త రోడ్డు దేవుడెరగు.. ముందు మోకాలోతు గుంతలు పడి 10 నిమిషాల ప్రయాణానికి అరగంట పడుతున్న హొళగుంద – ఆదోని రోడ్డులో గుంతలు పూడ్చాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాళ్లు తేలి, మొకాలోతు గుంతలు పడి అధ్వాన స్థితికి చేరి ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రధానంగా మారెమ్మ వంక నుంచి ధణాపురం వరకు ప్రయాణం నరకాన్ని చూపిస్తుంది. 25.115 కి.మీ ధణాపురం– హొళగుంద ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను ఇంతకు ముందు ఎన్‌డీబీ నిధులు రూ.62.29 కోట్లు మంజూరయ్యాయి. పనులు కూడా మొదలయ్యాయి. అయితే అర్ధంతరంగా పనులు నిలిచి పోయాయి. ఇటీవల బిల్లులు మంజూరయ్యాయని, త్వరలో 23.415 కి.మీ డబల్ తారు రోడ్డు, 1.7 కి.మీ డబల్ సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే నేటి వరకు పనుల విషయంలో అతీగతి లేదు. మారెమ్మ వంక నుంచి వందవాగిలి క్రాస్, హెబ్బటం – నాగనాథన హళ్లీ రోడ్డు మధ్య అడుగు అడుగుకు మోకాలోతు గుంతలతో ప్రయాణం సాగించలేకపోతున్నారు. రాత్రి సమయంలో గుంతలను తప్పించ బోయి ప్రమాదాలకు గురవుతున్నారు. మండల ప్రజలకు ప్రధాన మార్గం కావడంతో ఈ దారిలో రద్దీ ఎక్కువగ ఉంటుంది. ఈ రోడ్డు దుస్థితిని చూసి ప్రయాణం చేయలేక..ఎల్లార్తి మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో దూరం, ఖర్చు పెరగడమే గాక సమయం వృథా అవుతుంది.

బండి సాయంతో బుడిబుడి అడుగులు



బండితో నడక నేర్చుకుంటున్న చిన్నారి

మండలంలోని శభాష్‌పురం గ్రామంలో ఓ చిన్నారి ఇలా చెక్కతో తయారు చేసిన మూడు చక్రాల బండి సాయంతో బుడి బుడి అడుగులు వేస్తూ నడక నేర్చుకుంటోంది. పట్టణ ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఫైబర్‌తో తయారు చేసిన వాకర్ల సహాయంతో చిన్నారులకు నడక నేర్పుతుంటారు. అయితే పల్లెల్లో ఇప్పటికీ పాత కాలం వాటి వినియోగం కొనసాగుతుండటం విశేషం. – తుగ్గలి

అడ్డు తొలగించరూ!



రహదారిపై అడ్డుగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభం

హాలహర్వి: స్థానిక దుర్గమ్మ గుడి వద్ద విద్యుత్ స్తంభం రహదారిపై అడ్డుగా ఉంది. దీంతో ఈ మార్గం గుండా బిలేహాల్, నిట్రవట్టి, విరుపాపురం గ్రామాలకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రహదారిపై ఆదమరిచి వచ్చిన వాహనదారులు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి గాయపడిన ఘటనలు అనేకం. అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని వేరేచోట ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కోయిలకొండలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏపీసీ శ్రీనివాసులు

కృష్ణగిరి: జిల్లాలో సీజనల్ హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సొసైటీలపై కఠిన చర్యలు తప్పవని జిల్లా సమగ్ర శిక్ష పథక అధికారి (ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ) శ్రీనివాసులు హెచ్చరించారు. మండలంలోని కోయిలకొండ గ్రామంలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను శుక్రవారం ఆయన సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త సురేష్ రాజుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 10 మండలాల్లో వలస వెళ్లే విద్యార్థుల కోసం 34 హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. వీటిల్లో దాదాపు 1,736 మంది విద్యార్థులు ఆశ్రయం పొందుతున్నారన్నారు. ఇందులో మండలంలో కూడా ఐదు హాస్టళ్లను ఏర్పాటు చేశామన్నారు. సర్వశిక్షా అభియాన్ సహకారంతో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, అయితే సొసైటీలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వలస వెళ్లిన కుటుంబాల పిల్లలకు హాస్టల్ వసతితోపాటు సాయంత్రం పూట ట్యూషన్ కూడా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

పింఛన్ల తనిఖీ



జొన్నగిరిలో పక్షవాత పింఛన్ లబ్ధిదారును తనిఖీ చేస్తున్న అధికారులు

తుగ్గలి : మండలంలో ఆయా గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్లపై శుక్రవారం అధికారుల బృందం తనిఖీ చేపట్టింది. అనర్హులు సామాజిక భద్రతా పింఛన్లు పొందుతున్నారని భావించిన రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టిన 41 మంది వ్యాధిగ్రస్తుల పింఛన్లను స్థానిక అధికారులతో కలిసి స్పెషలిస్టు వైద్యులు రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. పలు అంశాలకు సంబంధించి లబ్ధిదారులను వివరాలు అడిగి తనిఖీ బృందం నమోదు చేసుకుంది. జూనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం స్థానిక వైద్యులు ప్రవీణ్‌కుమార్, హరిత, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

మద్దికెర : మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన దివ్యాంగుల పింఛన్ పొందుతున్న వారిని కర్నూలు వైద్య బృందం శుక్రవారం పరిశీలించి వివరాలు సేకరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పింఛన్‌దారుల వివరాలు, వారి స్థితిగతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి తెలిపారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు ఉన్నారు.

ఎడమ కాల్వను పొడిగించి సాగునీరివ్వాలి



పత్తికొండలో తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండ(తుగ్గలి) : పందికోన రిజర్వాయర్ ఎడమ కాల్వను పొడిగించి పొలాలకు సాగునీరు అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ మండల కార్యదర్శి రాజాసాహెబ్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి సురేంద్రకుమార్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, కారుమంచి తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. నిత్యం కరువు కాటకాలతో పంటలు పండక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పెద్దహుల్తి వద్ద ఆగిపోయిన పందికోన రిజర్వాయర్ ఎడమకాల్వను హోసూరు పొలాల మీదుగా చిన్నహుల్తి, దేవనబండ, జూటూరు, అటికెలగుండు, నలకదొడ్డి, ఆస్పరి మండలం బిల్లేకల్, వెంగలాయదొడ్డి చెరువు వరకు పొడిగించాలన్నారు. దీనివల్ల దాదాపు 15వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు పుచ్చకాయలమాడ పర్యటన సందర్భంగా ఆ గ్రామ పొలాలకు సాగునీరు ఇస్తామని చెప్పినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. కాల్వను పొడించి పొలాలకు నీళ్లిస్తే కరువు తగ్గడంతో పాటు, తాగునీటి సమస్య ఉండదన్నారు. రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సిద్దు, పెద్ద ముని, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి నెట్టి కంటయ్య, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఉపేంద్ర, అనుమేష్, కాశీ, నాగిరెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లిప్తత!

- వెల్దుర్తి సర్కిల్ పరిధిలో స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారుల నియామకంలో జాప్యం
- ఫ్యాక్షన్ జోన్ అయినప్పటికీ పట్టించుకోని ఉన్నతాధికారులు

వెల్దుర్తి: పోలీస్ శాఖకు కళ్లు, చెవులైన స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగం శాంతిభద్రతల విషయంలో కీలక పాత్ర పోషిస్తుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో నిత్యం నిఘా ఉంచి గొడవల నివారణకు చర్యలు చేపట్టడంలో వీరి సమాచారం కీలకం. అయితే వెల్దుర్తి సర్కిల్‌కు మూడు నెలలుగా స్పెషల్ బ్రాంచ్ పోలీసు అధికారి లేరు. ఇటీవల ఇంటెలిజెన్స్ పోలీసు సైతం బదిలీపై మాతృ సంస్థకు వెళ్లారు. జిల్లాల పునర్విభజనకు ముందు డోన్ సర్కిల్‌గా ఉండే వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల పోలీసుస్టేషన్లు జిల్లాల విభజన తర్వాత వెల్దుర్తిలో ఏర్పడిన నూతన సర్కిల్ కార్యాలయం పరిధిలోకి చేరాయి. ఈ సర్కిల్ పరిధిలోని రెండు మండల కేంద్రాలతో పాటు 72 గ్రామాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు, అధికారులు భయాందోళనలో గడుపుతున్నారు. వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లో కేటగిరి –4కు చెందిన మల్లెపల్లె, పుల్లగుమ్మి, ఎరుకులచెరువు, టి గోకులపాడు లాంటి ఫ్యాక్షన్ గ్రామాలున్నాయి. ఈ సర్కిల్ పరిధిలో ఎమ్మెల్యే సొంత గ్రామం కంబాలపాడు, మాజీ ఎమ్మెల్యే స్వగ్రామం కేటగిరి–1కు చెందిన ఫ్యాక్షన్ గ్రామం చెరుకులపాడు ఉంది. వీరి సొంత గ్రామాల నుంచే అధికంగా రాజకీయ సమావేశాలు, రాకపోకలు, వారి రాజకీయ కార్యక్రమాలు సాగుతుంటాయి. వీటన్నిటి విశ్లేషణ ఎంతో ముఖ్యం. 2017లో జరిగిన చెరుకులపాడు నారాయణరెడ్డి హత్యకు సంబంధించిన కోర్టు ట్రయల్ సైతం ప్రస్తుతం నడుస్తుండడం, అధికార పార్టీకి చెందిన ముద్దాయిలు సైతం గ్రామాల్లో ఉండడం ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళనతోపాటు, ఈ సర్కిల్‌లో స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారుల అవశ్యకతను తెలియజేస్తుంది. అంతే కాకుండా పార్టీలతో సంబంధం లేకుండా ఉన్నది ఉన్నట్లు చెప్పాల్సిన ఈ అధికారులు లేక ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆయా గ్రామాల్లో జరిగే, జరుగుతున్న, జరుగబోవు సమాచారం సేకరించే వారు కరువయ్యారు. వెల్దుర్తి మండలంలో బొమ్మిరెడ్డిపల్లె గిరినాథ్ హత్యోదంతం తర్వాత ఆ గ్రామంలో చెదురు మదురు సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇక అసాంఘిక కార్యక్రమాలు ఈ మండలాల్లో సర్వసాధారణం. కృష్ణగిరి మండలంలో కర్ణాటక మద్యం, వెల్దుర్తి మండలంలో నాటు సారా ఏరులై పారుతుంది . పాస్‌పోర్టు వెరిఫికేషన్ సైతం నత్తనడకన సాగుతూ అయోమయానికి గురిచేస్తోంది. రెండు మండలాల్లోని ఖనిజ నిల్వలు ఇనుము, గ్రానైట్, నాపరాళ్ల, ఇసుక, ఇతరత్రా అక్రమ రవాణా అరికట్టడంలోనూ స్థానిక పోలీసులకు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ అధికారుల సమన్వయం తప్పనిసరి. ఇలాంటి కీలకమైన ప్రాంతాల్లోని పోస్టులను భర్తీ చేయకపోవడంపై అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీలోనే రెండు మండలాల్లో వర్గాలుగా ఏర్పడి ఘర్షణలు జరుగుతున్నాయి. ఇటీవల మల్లెపల్లె, రామళ్లకోటల్లోని అధికారపార్టీ వర్గాల ఘర్షణే ఇందుకు నిదర్శనం.

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

- ఖాళీ స్థలాలను ఆక్రమిస్తున్న కూటమి నేతలు
- ఆలూరు చెరువును కబ్జా చేస్తే సహించం
- ఎమ్మెల్యే విరూపాక్షి



ఆలూరు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: కూటమి అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. శుక్రవారం ఆలూరు చెరువును పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కూటమి నేతలు కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే ఐదు రోజుల క్రితం ఆలూరు చెరువులో టీడీపీ నాయకులు దర్జాగా నంబర్ రాళ్లు పాతినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారన్నారు. మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ, పత్తికొండ డీఎస్పీకి ఫిర్యాదు చేసి ఒత్తిడి తీసుకురావడంతో గురువారం చెరువులో పాతిన రాళ్లను తొలగించారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత వరకు చెరువులో ఒక్క సెంటు భూమి ఆక్రమించినా సంహించేది లేదని హెచ్చరించారు. గతంలో నిర్వహించిన డీఆర్సీ మీటింగ్‌లో సైతం ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు.

మట్టి తరలింపుపై చర్యలేవి?

ఆలూరు చెరువులో కూటమి నేతలు అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. కొన్ని రోజుల క్రితం సీసీ రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ కావాలని తహసీల్దార్‌ను అడిగితే మైనింగ్ శాఖ నుంచి అనుమతి పొందాలని చెప్పారన్నారు. కానీ కూటమి నేతలు కాసుల కోసం చెరువులో తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్నా వారికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

ఎస్‌ఎస్ ట్యాంకు ఏర్పాటు చేయాలి..

ఆలూరు చెరువులో ఎస్‌ఎస్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని విరుపాక్షి తెలిపారు. వేసవిలో తాగునీటి కష్టాలు తీవ్ర స్థాయిలో ఉంటాయని గుర్తు చేశారు. ఈ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చాలన్నారు. హంద్రీనీవా నుంచి లేదా.. ఎల్‌ఎల్‌సీ కాలువ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసి ఆలూరు చెరువును నింపితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాంగోపాల్, వెంకటేషులు, గిరి, భాస్కర్, వీరేష్, నాగేంద్ర,ఎల్లప్ప,వరుణ్,మల్లి, రాజు ఉన్నారు.

మీ తోనే నా ప్రయాణం..



సమావేశంలో మాట్లాడుతున్న విరుపాక్షి

ఆలూరు: కార్యకర్తలతోనే తన ప్రయాణం సాగిస్తానని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి అన్నారు. స్థానిక ఉమా కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష్యుడు కురుబ మల్లికార్జున ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు శశికళ,జిల్లా విద్యాంగుల సంఘం అధ్యక్ష్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షుడు చిన్న ఈరన్న, ఎస్‌కే.గిరి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం హామీల అమలులో వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాను కూడా ఒకప్పుడు సామాన్య కార్యకర్తనేని, అయితే జగనన్న ప్రోత్సాహంతోనే ఎమ్మెల్యే కాగలిగానన్నారు. అనంతరం పార్టీ మండల నూతన అధ్యక్షుడు కురుబ మల్లికార్జును కార్యకర్తలకు పరిచయం చేసి, అభినందించారు. ఆలూరు ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీ శ్రీరాములు,హొళగుంద మండల అధ్యక్షుడు షఫీఉల్లా, నాయకుడు శేషప్ప, ఆలూరు మండల కో-కన్వీనర్ వీరేష్, ఎంపీటీసీలు దేవరాజ్, బాషా,ఎల్లమ్మ, మోతి ఎల్లమ్మ, యమునప్ప, వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, వీరభద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి,సర్పంచ్‌లు దేవిరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

కృష్ణగిరి: ఈ నెల 20వ తేదీ నుంచి మండలంలో రీ సర్వే ప్రారంభమవుతుందని, సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన సచివాలయ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ముందుగా మండలంలోని ఎరుకలచెర్వు గ్రామంలో ఈ నెల 20న సర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి సర్వేను వేగంగా పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీటీ లక్ష్మిరాజు, అన్ని గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

మద్దికెర : భూ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్, సర్పంచ్ మల్లికార్జున కోరారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామ పంచాయతీ కార్యాలయంలో భూ సర్వేపై గ్రామసభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ భూసర్వేతో భవిష్యత్‌లో అన్నదాతలకు భూసమస్యలు ఉండవన్నారు. భూ కొలతలు ప్రకారం రికార్డుల్లో నమోదు చేస్తామని చెప్పారు. వీఆర్వోలు బాలవర్ధిరాజు, ఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దేవనకొండ: ఇంటి పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రంగస్వామి, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆస్పరి సాయిబాబా అన్నారు. శుక్రవారం మండలంలోని బేతపల్లి గ్రామంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటిలో ఉన్న లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు. దోమల వల్ల కలిగేవ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఏఎన్‌ఎం రాధాబాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి: మండలంలోని నునసరాళ్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మండలంలోని లక్కసాగరం, చిట్యాల, కంబాలపాడు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 10 గంటలకు వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ సరఫరా ఉంటుందని, రైతులు గమనించాలని కోరారు.

అంతర్ పంట.. భళా



మాదాపురం సమీపంలో మామిడి తోటలో సాగుచేసిన మొక్కజొన్న పంట

కృష్ణగిరి: ఒకే పంటతో అన్నదాతలకు నష్టాలు వస్తుండటంతో అంతర్ పంటలు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇలా సాగు చేయడం వల్ల రెండు పంటల్లో ఏదో పంట వల్ల పెట్టుబడి దక్కుతుందని రైతులు చెబుతున్నారు. మాదాపురం గ్రామ సమీపంలో మామిడి తోటలో మొక్కజొన్న సాగు చేయడంతో పంట ఏపుగా వచ్చింది. అంతర్ పంట సాగుతో లాభాలు గడించవచ్చని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పంటలో అంతర్ పంట సాగు చేసుకోవచ్చని, ఇలా చేయడం వల్ల రైతులు నష్టపోయే అవకాశం తక్కువగా ఉంటుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రంలో మారెమ్మవ్వ, రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత, జొహరాపురంలో పెద్దమ్మవ్వ ఆలయాల్లో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రూపామోహన్ శర్మ , గోవిందు, సతీష్ ఆచారి ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చన, హోమాలు, మంగళహారతులు చేపట్టారు.



హొళగుంద వాల్మీకి సర్కిల్ వద్ద కుళాయి నుంచి వృథా అవుతున్న మంచినీరు

'నిరంతరం' వృథా

హొళగుంద: నీటి కోసం మండల కేంద్ర వాసులకు నిత్యం అష్టకష్టాలు తప్పడం లేదు. గృహ అవసరాల కోసం కుళాయిల నుంచి నాలుగు రోజులు లేదా, వారానికోసారి నీటిని విడుదల చేస్తారు. అయితే స్థానిక వాల్మీకి సర్కిల్ వద్దనున్న ఓ హోటల్‌కు గతంలో పంచాయతీ అధికారులు 24 గంటలు తాగునీటి సరఫరా అయ్యేలా కుళాయి కనెక్షన్ ఇచ్చారు. అయితే ఆ హోటల్ మూతపడి ఏడాది అవుతున్నా ఆ కనెక్షన్‌ను తొలగించ లేదు. ప్రస్తుతం ఆ కుళాయికి 24 గంటలు నీరు సరఫరా అవుతోంది. అయితే కుళాయి వాల్ విరిగిపోవడంతో నిత్యం నీరు వృథాగా పారుతోంది. అదేబాటలో మరి కొన్ని హోటళ్లకు కూడా ఇలాగే కుళాయి కనెక్షన్ ఇచ్చారు. వారు కూడా నీటిని వృథా చేస్తున్నారు. ఇళ్లకు వారానికో సారి నీరు దొరకని పరిస్థితుల్లో ఇలా వృథా అవుతుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారుల ఇష్టారాజ్యంపై మండిపడుతున్నారు.